క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య సత్తా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్యాట్ ఒలంపియాడ్ (2023-24) పరీక్షల్లో ప్రథమ స్థాయిలో 45 మంది తెనాలి చెంచుపేట శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రెండవ స్థాయి ప్రవేశ పరీక్షకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధురి తెలిపారు. శుక్రవారం శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి మాట్లాడుతూ మ్యాట్-20, ప్యాట్-07, చాట్-18 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచినట్లు చెప్పారు. రెండవ దశ ఫలితాల్లో కూడా ప్రతిభ సాధిస్తారన్న ఆశాభావం ఆమె వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ఆర్ఐ అప్పాజీ, కో-ఆర్డినేటర్ గోపీ, డీన్ రవి, సీ-బ్యాచ్ ఇన్‌ఛార్జ్ భగత్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఎస్ఆర్ఎంకు రూ.1.40 కోట్ల డీఎస్టీ గ్రాంట్

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయానికి కేంద్రం ప్రభుత్వం పరిధిలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ విభాగం నుంచి రూ.1.40 కోట్ల పరిశోధనా గ్రాంటు మంజూరయ్యాయి. యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ గ్రాంటును వినియోగించాల్సి ఉంది. కేవలం ఐదేళ్ల కిందట ప్రారంభమైన ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పరిశోధనల్లో సాధించిన పురోగతికి ఇది నిదర్శనమని వైస్ ఛాన్సలర్ మనోజ్ కుమార్ ఆరోరా అభిప్రాయపడ్డారు. పరిశోధనా సామర్థ్యాలను పెంచుకోవడానికీ, కొత్త ఆవిష్కరణకు ఈ గ్రాంటు ఎంతగానో దోహదపడుతుందని వీసీ మనోజ్ అన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగం ప్రొఫెసర్లను వైస్ ఛాన్సలర్ అభినందించారు.

డయల్ యువర్ డీఎంకు 5 వినతులు

విశాలాంధ్ర-పొన్నూరు : ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ డిఎం ప్రోగ్రాంకు 5 వినతులు అందినట్లు డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. పొన్నూరు వయా చిన్న లింగాయపాలెం పట్టిచెరుకూరు మీదుగా గుంటూరు, పొన్నూరు- కాకుమానుకు, పొన్నూరు-విజయ వాడ నాన్ స్టాప్, సింధనూరు బస్సు సర్వీసులను పునరుద్ధించాలని ప్రజలు కోరినట్లు డిఎం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సర్వీసులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర, తెనాలి : స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారని గ్రంథాలయ శాఖవారు తెలిపారు. వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు, యువతకు వివిధ రకాల ప్రతిభా పోటీలు జరుగుతాయని చెప్పారు. ముగింపురోజున అనగా 20వ తేదీన గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, మీడియావారు ఈ కార్యక్రమానికి సహకరించాలని గ్రంథాలయశాఖ వారు విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాల అవగాహన సదస్సు

విశాలాంధ్ర, తెనాలి : జి.వి.డబ్ల్యూ.వి అండ్ వి.యస్.డబ్ల్యూ.యస్. డిపార్టుమెంటు వారి జి.ఓ.యం. యస్.నెం.07 ప్రకారం ప్రభుత్వం వారు అమలు చేయుచున్న నగదు నేరుగా బదిలీ కాబడుచున్న 25 సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులు సంఖ్య, లబ్ది పొందిన నగదు మొత్తం వివరములు, 4నగదు రహిత పథకాలు, 4 ప్రాధాన్యత పథక వివరాలను తెలుసుకొనుటకు సచివాలయముల వద్ద బోర్డులను ప్రదర్శించి యిందుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం తెనాలి, నందులపేట సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎం.జశ్వంత రావు మాట్లాడుతూ 4వ వార్డు పరిధిలో సుమారు 13 కోట్ల రూపాయలతో సంక్షేమం అమలు చేశారన్నారు. ఇంకా ఎవరికైనా ఏదైనా కారణాల వలన సంక్షేమ పథకాలు అందనట్లయితే వాటిని పరిష్కరించమని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు టి.శేషాచలం, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా విలియమ్స్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండల ఇన్‌చార్జి ఎంపిడివోగా పి.జాకోబ్ విలియమ్స్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపిడివోగా విధులు నిర్వహించిన దాసరి అనురాధ పదోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో ఇన్ చార్జి ఎంపిడివోగా ప్రస్తుతం మంగళగిరి ఎంపిడివోగా పని చేస్తున్న విలియమ్స్‌కు బాధ్యతలు అప్పగించారు. తన వంతుగా మండల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

దంత పేషంట్లకు మందులు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తమిళ్‌నాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పట్నంబజార్ లోని బ్యాంక్ ఆవరణలో కాన్ఫిడెన్స్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ పీవీ రంజిత్ కుమార్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన 150 మంది పేషంట్లను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ రాజప్పన్ పాల్గొన్నారు. ఈ శిబిరంలో బ్రాంచి మేనేజర్ దినకర్ జేబకుమార్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో జగనన్నకు చెబుదాం...

విశాలాంధ్ర-తాడికొండ: నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేకమంది అర్జీలను అందజేశారు.తాడికొండ అడ్డ రోడ్డు లోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పున్నమ్మ చెరువును కాపాడాలని సిపిఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, రామినేని నరసింహారావులు జెసి రాజకుమార్ కి వినతి పత్రం అందజేశారు. విద్యుత్తు రెవెన్యూ కు సంబంధించి ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి రాజకుమారి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమాన్ని తీసుకుందన్నారు . దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు . అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించడం జరిగిందని, 15 రోజులలో సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు . ఎవరికైనా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తమను సంప్రదించాలని అర్జీ దార్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, జిల్లాస్థాయి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గాంధీ పార్క్ సద్వినియోగం చేసుకోవాలి: సజ్జల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అన్ని వర్గాలను ఆకట్టుకునేలా అభివృద్ధి చేసిన గాంధీ పార్క్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ఎంపి అయోధ్యరామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, ఎంఎల్ఏలు మహ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్‌లతో కలిసి రూ.6.25 కోట్లతో అభివృద్ధి చేసిన నగరపాలక సంస్థ గాంధీ పార్క్‌ను పునః ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లా డుతూ రాష్ట్రంలోని నగరాలన్నింటిలో ఆహ్లాదకరమైన పార్క్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని అన్నారు. మానసిక ఒత్తిడి, వాతావరణ కాలుష్యం నుండి పచ్చదనం ప్రశాంతతని అందించడంలో పార్క్‌లు ప్రధాన పాత్ర పోషిస్తాయని, గాంధీ పార్క్ అభివృద్ధి ద్వారా గుంటూరు నగర ప్రజలకు ఆహ్లాదం అందేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుందన్నారు. గాంధీ పార్క్ పిల్లలను ఆకర్షించేలా స్ప్లాష్ ప్యాడ్, జంగిల్ బుక్, వెస్ట్ టు వండర్, గుంటూరు ఎక్స్ ప్రెస్ టాయ్ ట్రైన్, చెస్ బోర్డ్, జీబ్రాలు, జిరాఫిల నమూన ప్రదర్శనశాల, బటర్ ఫ్లై జోన్ లు, అందరిని అలరించేలా సెల్ఫి పాయింట్స్, సీటింగ్ ప్లాజాలు, పార్టీలాన్, ఓపెన్ జిమ్‌లతో నగరానికి నూతన శోభను తెస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీలా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వివిధ కుమ్మరి, శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల కార్పోరేషన్ల చైర్మన్ పఠాన్ ముంతాజ్, జిడిసిసి బ్యాంక్ చైర్మన్ రామాంజనేయులు, జిఎంసి ఎస్ఈ భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, ఎంహెచ్ఓ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

యూనియన్ నాయకుడు మధుబాబు అరెస్ట్

గాంధీ పార్క్ పునః ప్రారంభానికి ముఖ్య అతిథిగా గుంటూరుకు వచ్చిన ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణా రెడ్డికి వినతిపత్రం ద్వారా రాష్ట్రంలోని మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు వివరించేందుకు గాంధీ పార్క్ వద్దకు యూనియన్ కమిటీ సభ్యులు సభ్యులతో కలసి వచ్చిన తనను అరెస్ట్ చేసినట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు తెలిపారు. అయినప్పటికీ యూనియన్ కమిటీ సభ్యులు వెనుకకు తగ్గకుండా వినతి పత్రాన్ని సజ్జలకు అందజేసినట్టు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఏసుబాబు, సుమన్, కుమారి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కౌలు రైతులకు షూరిటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ బ్యాంకులు రుణాలు మంజూరులో అలసత్వం చేస్తున్నాయని, కౌలు రైతులందరికి షూరిటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి మాట్లాడుతూ పంట రుణాలు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలని, జిల్లాలో సాగు భూముల్లో 80 శాతం పంటలు పండిస్తున్న వారంతా కౌలు రైతులేనని, అంతా పేద మధ్యతరగతి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ కులాలకు చెందినవారని అన్నారు. సాగు చేస్తున్న భూమి దామాషా ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం రూ.1,60,000ల వరకు ఎటువంటి హామీ లేకుండానే రుణాలు ఇవ్వాలని వారు కోరారు. సిసిఆర్సి కార్డు లేని కౌలు రైతులు జాయింట్ లయబులిటీ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే ఆ గ్రూపు షూరిటీగా పంట రుణాలు ఇవ్వాలి. కానీ గుర్తింపు కార్డులు ఉన్నవారికి మాత్రమే గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలు పెట్టడం ఏ మాత్రం సరైనది కాదని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాలు పొందిన కౌలు రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపచేయాలని, దేవాదాయ భూములు కౌలు చేస్తున్న కౌలు రైతులకు లంక భూములు, సొసైటీ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పి.వి.జగన్నాథం, ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రాన్ని అభివృద్ధిలోనూ సంక్షేమంలోనూ పరుగులు తీయిస్తున్న జగన్ 2024లో మళ్లీ ముఖ్య మంత్రి కావడం ఖాయమని రాజ్యసభ సభ్యు లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యాపక అధ్య క్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పి.ముత్యం గుంటూరు నగరంలో 'జగన్ ఎగైన్ స్టిక్కరింగ్' కార్యక్రమాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన మరో నాయకుడు లేడని అన్నారు. లోగో రూపశిల్పి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగన్ తిరిగి ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారం కైవసం చేసుకోవడం తథ్యం అన్నారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు డాక్టర్ పి.ముత్యం మాట్లాడుతూ దళిత జనులతో పాటు క్రైస్తవ సోదరుల అభ్యున్నతికి కూడా కృషి చేస్తున్న సీఎం అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యూకే వింగ్ సభ్యులు మలిరెడ్డి కిషోర్ రెడ్డి, పాలడుగు పేరయ్య చౌదరి, షేక్ మీరావలి, నరసింహ చౌదరి, షేక్ నూరి ఫాతిమా, సాని కొమ్ము జ్యోతి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు మద్దతిస్తే బీజేపీ కార్యాలయాల ముట్టడి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు ప్రధాని నరేంద్ర మోడీ మనవాదాన్ని పోషించడానికి ఒక వర్గాన్ని పోషించడం మాల సంఘాల జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందని నేటికీ మతతత్వ పార్టీగా ముద్ర పడిన బీజేపీ మాదిగల విశ్వరూప సభలో వర్గీకరణకు మద్దతుగా మాట్లాడితే కులతత్వం పార్టీగా ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూ, ఆ సభకు మోడీ హాజరవ్వటాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీజేపీ కార్యాలయాలు ముట్టడించాలని వివిధ మాల సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర వ్యాప్త మాల సంఘాల ఆధ్వర్యంలో గోదా జాన్ పాల్ అధ్యక్షతనమాలల మేథోమథన సదస్సు జరిగింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముఖ్య అతిథిలుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్, మాల మహాసభ మల్లెల వెంకటరావు ఏపీఎస్ పార్టీ నాయకులు పంతగాని రమేష్ సమతా సైనిక దళ్ పాలేటి, ఉమ మహేశ్వరరావు, తాళ్లపల్లి రవి, అన్నవరపు కిషోర్ మాల మహానాడు చార్వాక, కొండబాబు ఆంధ్ర మాల మహానాడు, బత్తుల అనిల్ జూపూడి మాల మహానాడు, తుమ్మల ఫ్రాన్సిస్, నల్లపు నీలాంబరం భీమ్ సేన సేవాదళ్,గోశాల మనోహర్,గుర్రం రామారావు, దారా హేమ ప్రసాద్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కేఎల్‌యూలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం నాడు ఎంటర్ ప్రెన్యూర్షిప్ గురించి విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించినట్లు ఏసిఐసి సీఈఓ రామన్ కాంత్ తెలిపారు. యువతలో దాగి ఉన్న వ్యాపార సామర్థ్యాన్ని వెలికితీసి యువతను ఆ దిశగా ప్రోత్సహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మేడపాటి వెంకట్, కెఎల్ యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు ముఖ్య అతిథులుగా హాజరయి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, ఔత్సాహికులు వారి యొక్క ఆలోచనలతో ఈ సమాజాన్ని ఏ విధంగా మార్చగలరో వాటి యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వ సలహాదారు మేడపాటి వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకమైన ఆలోచనలతో ఏ విధమైన వ్యాపార అవకాశాలను హస్తగతం చేసుకొనవచ్చునో, దానికి ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తుందో, దాని ద్వారా ఔత్సాహికులు ఏవిధంగా వారి జీవితాలలో ఎలా స్థిరపడవచ్చో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్‌లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం, ఎసిఐసి సీఈఓ వల్లభనేని రామన్ కాంత్, కెఎల్ టిఎఫ్ సీఈఓ గోవిల్ అలోక్ , బిసిఏ విభాగాధిపతి మోహన్ రెడ్డి, డిటిఐ డాక్టర్ నరసింహ రాజు, పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి సాధించిన స్టార్టప్స్ పాల్గొన్నారు.

పెద్ద గొట్టిపాడులో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: మండల పరిధిలోని పెద్ద గొట్టిపాడులో 2018లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్సీలకు, ఓసీలకు మధ్య జరిగిన గొడవలో ఎస్సీలను సాంఘిక బహిష్కరణ గురి చేస్తున్నారంటూ పలుమార్లు ఫిర్యాదులు రావటంతో హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడి, గుంటూరు జిల్లా ఐజి పాల్ రాజ్ గొట్టిపాడు గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాల నుంచి వివరాలు సేకరించి వాటిని రికార్డు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో శ్రీ రమ్య, జిల్లా అధికారులు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగర పరిధిలోని ప్రధాన రోడ్లకు మరమత్తులను ఏఈల వారిగా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిఎంసి ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనేకే ప్రాంతాల్లో రోడ్లు గోతులు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిలో కొన్ని జిఎంసివి అయితే మరి కొన్ని ఆర్అండ్‌బికి చెందినవి ఉన్నాయన్నారు. నగర పరిధిలో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నరోడ్ల మరమత్తులకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోను నెలాఖరు నాటికీ రోడ్ల మరమత్తులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డి.ఈ.ఈ.లు మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ళ పురోగతి పై సమీక్షించి నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డి.ఈ.ఈ.లు, ఏ.ఈ.లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సంఘీభావ ప్రదర్శన జయప్రదం చేయండి : మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వామపక్షాల ఆధ్వర్యంలో పలస్తీనా ప్రజలకు మద్దతుగా శనివారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు జరిగే నిరసన ర్యాలీలో సిపిఐ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజాసంఘాల కార్యకర్తలు అలాగే వామపక్ష పార్టీల కార్యకర్తలు, నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. స్థానిక చాకలగుంట సిపిఐ కార్యాలయం జీవీకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా , ఇజ్రాయిల్ సంపదను దోచుకోవడం కోసం వారికి మద్దతుగా యుద్ధం చేస్తుతుందని, అమెరికా ఎత్తుగడలను ఐక్యరాజ్యసమితి లోనీ 120 దేశాలు పాలస్తీనాకు మద్దతుగా ఓటు వేసినప్పటికీ భారతదేశ ప్రధాని మోడీ యుద్ధానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి సైతం మోడీ యుద్ధకాంక్షతో గైర్హాజర్ అవడం భారత దేశ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ఉందన్నారు. శాంతిని కోరుకునే భారతదేశం ప్రజల ఆకాంక్షలను వ్యతిరేకంగా ప్రవర్తించారని యుద్ధకాంక్ష బయటపెట్టాడని అన్నారు. ఎప్పటికైనా అమెరికా యుద్ధంలో పాల్గొని గణాలో జరుగుతున్న దాడులు నిలుపుదల చేసి ఆ ప్రాంత ప్రజలకు నిత్యవసర సరుకులు నీరు, విద్యుత్, వైద్యం అందించాలని, దీనికి ప్రపంచ దేశాలు ఐక్యంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపోతుల విజయకుమార్, అంగడి కిషోం , కోటి వీరాంజనేయులు, ఉయ్యాల దశరథ, బి కొండయ్య పాల్గొన్నారు.

16న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

విశాలాంధ్ర, తెనాలి : ఈ నెల 16వ తేదీన తెనాలి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో జరుగుతుందని తెనాలి మున్సిపల్ కమీషనర్ యం.జశ్వంతరావు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. ముందస్తు ఒప్పందంలో భాగంగా ఛైర్మన్ పదవి ఖాలేదా నసీం, తాడిబోయిన రాధిక చెరి సగం పిరియడ్ చేసే విధంగా అంగీకరించి అందులో భాగంగా ఖాలేదా నసీం గత నెల 12న తన పదవికి రాజీనామా చేశారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా నిలిచిన జగన్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్ర ప్రజా సంక్షేమానికి సమృద్ధిగా సుపరిపాలన అందించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి దేశా నికే ఆదర్శంగా నిలిచారని తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మండల కేంద్రమైన ఫిరంగిపురం గ్రామ సచి వాలయంలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న తన సుదీర్ఘ పాద యాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని అనేక పథకాలు ద్వారా రాష్ట్ర ప్రజలను ఆదుకున్నారన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, డ్వాక్రా సున్నావడ్డీలతో పాటు నవరత్నాలు ద్వారా అనేక పథకాలతో పేద కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేసిన జగనన్న ఏపీకి కావాలని గుర్తు చేశారు. మండలంలో నేటి వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన వ్యయ ఖర్చు వివరాల బోర్డును సురేష్‌కుమార్ ఆవిష్కరిం చారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కోరారు. కార్యక్రమానికి ముందుగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రానున్న ఎన్నికల్లో పందులు గుంపుగా వస్తాయని సింహం సింగిల్‌గా వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజా సంక్షేమాభివృద్ధికి సమృద్ధిగా సేవలు అందించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి షేక్. షహెలా నర్గీస్, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, ఎంద్రెడ్డి హేమలత, వైకాపా నాయకులు జేమ్స్, పెరికల మరియబాబు, సుధాకర్‌రెడ్డి, ఎంద్రెడ్డి యల్లారెడ్డి, చిన్నప్పరెడ్డి, సర్పంచ్ మేడా బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎంద్రెడ్డి రమాదేవి, గొల్లపాలెం సర్పంచ్ దాసరి మెల్కియా, హౌస్‌గణేష్ సర్పంచ్ వేల్పుల వీరయ్య, ఎంపిటిసిలు సాలె నాగరాజు, లక్ష్మయ్య, ఎంపిడివో విలియమ్స్, సెక్రటరి విష్ణువర్ధన్‌రావు, వైకాపా నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌పీలో ముందస్తు దీపావళి వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో ఉన్న డాక్టర్ కెఎల్‌పీ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముందుగా దీపావళి పర్వదిన విశిష్టతను వివరించారు. అనంతరం పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పర్యావరణ హిత బాణ సంచాను మాత్రమే తగిన జాగ్రత్తలతో కాల్చాలని చెప్పారు. ప్రిన్సిపల్ వై.రధిని చౌదరి మాట్లాడుతూ ఈ పర్వదినం చెడుపై మంచి గెలిచిన నేపథ్యంలో విద్యార్థులందరూ సత్ప్రవర్తనతో మెలుగుతూ ఎదగాలన్నారు. విద్యార్థులు ఆలపించిన గేయాలు, అభినయించిన నృత్యాలు అందరినీ అలరించాయి. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, పాఠశాల ఏఓ కె.వెంకటరావు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు: జాతీయ విద్యా దినోత్సవం, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన వేడుకలు స్థానిక చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్ర పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ముఫ్తీ అబ్దుల్ ఆసిఫ్ నద్వీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ విద్యావంతుని కావాలని అలాంటప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లు తుందని అన్నారు. లౌకికవాద భావాలున్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణ చేపట్టిన ఘనత ఆజాద్‌దే అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి బి. విజయలక్ష్మీ, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ గుంటూరు జిల్లా శాఖ సెక్రెటరీ అబ్దుల్ ఖవీ రాషదీ మరియు సెక్రెటరీ అబ్దుల్ జాఫర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఆర్ఎంలో ముందస్తు దీపావళి

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలు మిన్నంటాయి. యూనివర్సిటీ మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రకాల ఆటల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు సందడి చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాతో పాటు డీన్లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాంప్ వాక్లో పాల్గొన్న వీసీ మనోజ్ కుమార్ అరోరా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పానీ పూరీలను ఆరగించే పోటీల్లో వందన, సందీప్లకు ప్రథమ బహుమతి లభించగా, హేమంత్, భానుప్రకాశ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. అదేవిధంగా బెలూన్ గ్లాస్ పోటీల్లో శైలజకు ప్రథమ బహుమతి లభించగా, రేవతి, సుస్మితలకు రెండో బహుమతి లభించింది. పాసింగ్ బాల్ పోటీల్లో రేవతి, వై మాధురిలకు బహుమతులు లభించాయి. పురుషుల విభాగం పాసింగ్ బాల్ పోటీల్లో నాగరాజు, గౌతంలకు మొదటి రెండు బహుమతులు లభించాయి. ర్యాంప్ వాక్ పోటీల్లో శ్యాంకుమార్రెడ్డి, అరుంధతికు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ పోటీలను హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగన్ పర్యవేక్షించారు.

ముస్లింలకు జగనన్న పాలనలోనే గుర్తింపు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశంలో ఎక్కడా లేని విధంగా మైనారిటీల భద్రత, సంక్షేమం, ఉన్నతికి చేయూత అందించాలనే ఆలోచనతో అనేక నిర్ణయాలు తీసుకుని వాటిని పక్కాగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరి తదితరులతో కలి విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ గతంలో ముస్లిం మైనారిటీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నాయని ఆరోపించారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లభించినన్ని పదవులు గతంలో మరే ప్రభుత్వంలోనూ ముస్లింలకు లభించలేదన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ అందరూ విద్యావంతులైతే సమాజం, రాష్ట్రం బాగుపడుతుందన్న భావనతో ముఖ్యమంత్రి జగన్ విద్యార్థులపై సంపూర్ణ విశ్వాసంతో పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రోషన్, కార్పొరేటర్లు షేక్ రోషన్, మార్కెట్ బాబు, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, బూసి రాజలత, ప్రభుత్వ ఖాజీ ఉస్మాన్, నూనె ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు అసంపూర్ణం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: కేంద్రం ప్రకటించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళా రిజర్వేషన్ శాతం ఎంతో తేల్చి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చుట్టుగుంట లోని రాష్ట్ర బీసీ యువజన కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 12వ తేదీన అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, బీసీ సంఘాల నాయకులు, బీసీ ప్రజానీకంతో కలిసి ఢిల్లో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా బిల్లులో ఓబీసీ కోటాపై లోక్ సభ, రాజ్యసభలలో ఒక్క ఓబీసీ ఎంపీ అయిన తమ గొంతు విప్పిన దాఖలాలు లేవన్నారు. బీసీల గురించి మాట్లాడే నాయకులు బీజేపీ చెప్పిన వారి వైపే మొగ్గు చూపుతూ బీసీ బీసీ అంటూ బీసీ ప్రజలను మోసగిస్తున్నారు అన్నారు. నూటికి 60 శాతం పైగా ఉన్న ఓబిసి కులాలు పట్టుమని పది శాతం లేని అగ్రకులాల చేతుల్లో బానిసలుగా ఉండేలా పరిస్థితులను తీర్చిదిద్దారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, తురక శ్రీనివాస్, కొల్లూరు హనుమంతరావు, ద్వారకా శ్రీను, తురక రమేష్, ఉడత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KOMATI KRUSHNAIAH** (Old Name), S/o. **KOMATI LAKSHMI NARAYANA**, R/o. D.No.5-48, Ravela Village, Tadikonda Mandal, Guntur District - 522018, Andhra Pradesh, have changed my name to **KOMATI KRISHNAIAH.** Hereafter my name is known as **KOMATI KRISHNAIAH.**

CHANGE OF NAME

I, DARLA CHITTEMMA, (OLD NAME) D/o.SREE RAMULU, R/o. D.No. 10-190, Hosanna Mandir, Gorantla, Guntur District, A.P. Have changed my name as **DARLA HULDAH RANI (New Name) D/o. SREE RAMULU.** Here after my name known as **DARLA HULDAH RANI (New Name) D/o.SREE RAMULU** for Passport and all Purposes.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వైద్యాధికారిణికి సన్మానం



విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణినిగా పని చేస్తూ బదిలీ అయిన డాక్టర్ స్వాతికి శుక్రవారం సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి మాట్లాడుతూ స్వాతి రోగులకు విశేష సేవలు అందించారన్నారు. కరోనా సమయంలో ఆమె చేసిన వైద్య సేవలు మరువలేనివని, ఇక్కడ నుండి బదిలీపై వెళ్ళటం బాధాకరమన్నారు. వైద్యాధికారిణి స్వాతి మాట్లాడుతూ గ్రామస్థులు, వైద్య సిబ్బంది సహకారంతో వైద్యసేవలందించానని అన్నారు. వారి సహకారం మరువలేనిదని, ఉద్యోగ రీత్యా బదిలీపై వెళ్ళుతున్నా ఇక్కడ వారిని మర్చిపోనని అన్నారు. అనంతరం ఆమెను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, సిహెచ్ ఓ.చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభలు జయప్రదం చేయండి



విశాలాంధ్ర-సత్తెనపల్లి : నరసరావుపేటలోని ఏపీ ఎన్జీవో హోమ్ ఆవరణలో ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలు ప్రారంభవుతాయని, వాటిని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి బస్టాండ్ ఆటో పాయింట్ వద్ద, గార్లపాడు బస్టాండ్, రెంటపాళ్ళ, పాకాలపాడు ఆటో పాయింట్ల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.ఆర్ మస్తాన్. ఈసి రెడ్డి అంజిరెడ్డి. ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు జొన్నగడ్డ నాగయ్య. కోటేశ్వరరావు, శీను, దాసు, జైపాలె, శంకరు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు అభినందనీయం

విశాలాంధ్ర-వినుకొండ : గత 20 ఏళ్ళుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యా శాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా అన్నారు. శుక్రవారం స్థానిక జడ్.పి.హెచ్ బాలికల స్కూల్ నందు సైన్స్ ప్రచారంలో భాగంగా ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక వినుకొండ డివిజన్ అధ్యక్షులు కమలా రామ్. అధ్యక్షత వహించారు. ఈ ప్రతిభ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని. పాఠశాలల్లోని 8 9 10 తరగతికి చెందిన సుమారు రెండువేల పైచిలుకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారి ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ. విద్యార్థులలో సైన్సు. జీవ శాస్త్రాలలో. అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ముగ్గురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేస్తారన్నారు. ఈనెల 30వ తేదీన మండల స్థాయిలో ప్రతిభ పరీక్ష జరుగుతుందని మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయిలో డిసెంబరు 17న పరీక్ష నిర్వహిస్తారని అనంతరం రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక చలపతిరావు సిహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడులో శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.వి. రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని, మేధావులను గుర్తు చేసుకోవటం శుభ పరిణామమని అన్నారు. ముఖ్యంగా నేడు ఆనాటి త్యాగమూర్తులు, సైన్స్ మేధావులు ఫలితాలతోటి ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి త్యాగాలు మరువలేమని కొనియాడారు. అనంతరం సైన్స్ మేధావుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ, నాగరాజు, నరేష్, మురళీధర్, కాంతాయని, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : జడ్పీ హైస్కూల్లో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం పాఠశాల స్థాయి వాలీబాల్ కబడ్డీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్స హిస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : స్థానిక నరసరావుపేట రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాన్‌టెస్ట్-2004 శ్రీనిఖిల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.పోతురాజు పాల్గొన్నారు. తరువాత నాసాలో ఉన్న 33 మంది విద్యార్థులకు నాసా కిట్లు అందజేసి, నాసా విశిష్ఠతను గురించి వివరించాడు. ప్రిన్సిపల్ శ్రీకాంత్ విద్యార్థులందరిని అభినందించి ప్రతి విద్యార్థి అనేక రకాల నాసా. ప్రాజెక్టులలో పాల్గొని ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్‌జే అప్పాజీ, డీన్ నాగూర్, కోటి, నాసా ఇన్‌ఛార్జ్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడులో లారీ బోల్తా

విశాలాంధ్ర-యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారిపై లోడు లారీ శుక్రవారం బోల్తా పడింది. రాయపూర్ నుంచి చెన్నై కరెంటు సామాగ్రి లోడుతో వెళ్తున్న క్రమంలో యడ్లపాడు సినిమా హాలు వద్దకు రాగానే వేగంలో వున్న లారీ డివైడర్ను ఢీకొని సర్వీస్ రోడ్డు లోకి పల్టీ కొట్టింది. ప్రమాదంలో లారీ పాక్షికంగా దెబ్బతినగా అందులోని సామాగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-దుర్గి: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు నిమిత్తం శనివారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ.ఎం.రాంబాబు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. కావున ప్రజలు కరెంట్ ఉన్న సమయంలో అవసరాలు తీర్చుకోవాలని పేర్కొన్నారు.

ప్రతి ఇంటిలో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-పొన్నూరు : గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదేనని వైసీపీ జేసిఎస్ మండల కన్వీనర్ భవనంవంశీ రెడ్డి అన్నారు. శుక్రవారం ములుకుదురు గ్రామం సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్ప్లే ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామంలో రూ. 8కోట్ల వివిధ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు.

పలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధాన్ని ఖండించాలి

రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల పిలుపు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పలస్తీనాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న నరమేధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, పలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం పాలస్తీనా ప్రజల సంఘీభావమిత్రుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వ హించారు. ఈ సభకు ప్రముఖ న్యాయవాది, సీపీఐ సీని యర్ నాయకులు ఆర్ వెంకటేశ్వరరావు(ఆర్‌వీ) అధ్యక్షత వహించారు. సీపీఐ నాయకుడు నాయుడు శివకుమార్ సభ పరిచయం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతి థిగా ప్రొఫెసర్ జమీన్‌దార్ మాట్లాడుతూ ప్రస్తుత పల స్తీనా పరిస్థితిని తెలుసుకోవాలంటే గత చరిత్ర తెలుసుకో వాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అపారమైన చమురు నిక్షేపాల కోసం అమెరికా అధిపత్యం కోసం ఇజ్రాయిల్‌కు మద్దతు పలుకుతుందని వివరించారు. ఇజ్రాయిల్ నెత న్యహు ప్రభుత్వం ఓపెన్ ఎయిర్ జైలు వంటి గాజా ప్రాంత ప్రజానీకానికి మంచినీరు, విద్యుత్తు, ఆహార సర ఫరా నిలిపివేసి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఐక్య రాజ్యసమితిలో 120 దేశాలు తక్షణం యుద్ధ విరమణ పాటించాలని తీర్మానం ప్రవేశపెడితే భారత ప్రభుత్వం గైర్హాజరు కావడం ద్వారా ద్వంద ప్రమా ణాలు మోదీ ప్రభుత్వం పాటిస్తుందన్నారు. పలస్తీనా వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు ఐక్యరాజ్యసమితి చొరవ తీసుకోవాలని, ఆ సమయంలో పలస్తీనాకు భారత్ అండగా నిలవాలని డిమాండ్ చేసింది. నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు మాట్లాడుతూ ఎక్కడ చూసినా శవాల గుట్టలు, పసిపిల్లల ఆర్త నాదాలతో గాజా ప్రాంతమంతా రోదనగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 75 ఏండ్లుగా పాలస్తీనా భూభాగాన్ని అక్రమించుకుంటూ ఈ యుద్ధం ద్వారా ప్రపంచ పటం నుంచి పాలస్తీనా ఉనికి లేకుండా చేయాలని, పాలస్తీనా ప్రజలందరిని శరణార్థులుగా మార్చేసి అ భూబాగాన్ని అక్రమించాలని, ఒక సామ్రాజ్యవాద అధిపత్య కుట్రతో యుద్ధం కొనసాగుతున్నదన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు ఆర్ వెంకటేశ్వరరావు(ఆర్‌వీ) మాట్లాడుతూ అమెరికా ఒక్కటే ఇజ్రాయిల్‌కు అండగా నిలబడిందన్నారు. దేశంలోని బీజేపీ ప్రభుత్వం గత సంప్రదాయాలకు భిన్నంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఇది మన దేశానికి ప్రమాదకరమని, ప్రపంచ శాంతికి నష్టం కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్‌లోని గాజా ప్రాంతాన్ని వదిలిపెట్టాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను అంగీకరించాలని కోరారు. మీడియా అంతా అమెరికా, ఇజ్రాయిల్ కనుస న్నల్లో నడుస్తుందని ఆరోపించారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని, భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇనగంటి జగదీష్, మహిళా రాష్ట్ర కార్యదర్శి షేక్ జరినా సుల్తానా, షేక్ జమాల్‌బాష, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ,బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లపు కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్, జనక్రాంతి అధ్యక్షుడు షేక్ గౌస్, సీపీఐ నాయకుడు బొంతా భగత్‌సింగ్, ప్రజా సంఘాల నాయకులు వంజా ముత్తయ్య, షేక్ అల్లాబక్షు, అడపా మోహన్‌రావు, బి శ్రీనునాయక్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలపై ఆరా

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాజాపేట గురుకులం విద్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పద్మావతి శుక్రవారం సందర్శించి విద్యార్థులను సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజుల క్రితం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర చైర్మన్ పరిశీలన చేశారు. విద్యార్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఆహారం, చదువు, పర్యవేక్షణ, వసతులు సక్రమంగా లేవని తెలి పారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని, కొద్ది రోజులలోనే సమస్యలు పరిష్కరించకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మండల తహశీల్దార్ సుజాత, ఎంపిడిఓ కె.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సిడిపిఓ జి.శాంతకుమారి, ఏఐఎస్ఎఫ్ నాయకులు మేకపోతుల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు బొంతా భగత్‌సింగ్, చిలకలూరిపేట రూరల్ ఎస్సై బాలకృష్ణ, రాజాపేట గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ వసంతోత్సవం

విశాలాంధ్ర-రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) 105వ వసంతోత్సవాన్ని బ్యాంక్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభి సీతారామయ్య స్థాపించిన ఆంధ్ర బ్యాంక్ తెలుగు నాట పురుడు పోసుకున్న ఏకైక జాతీయ బ్యాంక్ దినదిన ప్రవర్ధమానంతో ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నదన్నారు. బ్యాంకు సిబ్బంది, అధికారుల సమన్వయంతో ఖాతాదారులకు అందుతున్న విశేష సేవలు మరువలేనివన్నారు. ఖాతాదారుడు మద్దిరాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ లక్ష రూపాయల మూలధనం, రూ.10 లక్షల అధికృత మూలధనంతో 1923 నవంబర్ 28న కార్యకలాపాలు సాగించిన ఆంధ్ర బ్యాంక్ సుదీర్ఘ విశేష సేవలతో 104 వసంతాలు పూర్తి చేసుకుని 105వ వసంతంలోకి అడుగిడి నేడు దేశవ్యాప్తంగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ విశాల్, గొంటు సుమంత్ రెడ్డి, చేర్రెడ్డి కోటిరెడ్డి,ఉడుముల సీతారామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మరణించిన వారి ఓట్లు తొలగించండి

విశాలాంధ్ర-శావల్యాపురం : మరణించిన వారి ఓట్లు, డబల్ ఎంట్రీలను తొలగించాలని వయ్యకల్లు గ్రామ సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు బూత్ లెవెల్ అధికారికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వయ్యకల్లు గ్రామంలో గల 140వ పోలింగ్ బూత్ నందు మరణించిన వారి ఓట్లు 70, డబల్ ఎంట్రీలు 32 ఓట్లు ఉన్నాయని వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, గ్రామంలో సర్వే నిర్వహించి ఈ ఓట్లను ఓటరు లిస్టు నుండి తొలగించి ప్రక్షాళన చేయాలని కోరారు. ఆయనతో పాటు తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు నడింపల్లి శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ దారా శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకులు ఆలూరి యుగంధర్ ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మండలంలోని చినకంచర్ల, పిచికలపాలెం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నకంచర్లలో నాలుగో తరగతి విద్యార్థుల శక్తిసామర్థ్యాలను నిశితంగా పరిశీలించారు, అదేవిధంగా పిచ్చికలపాలెం ఎంపీయూపీ పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. పాఠశాలలో అన్ని రకాల రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న గోరుముద్ద ద్వారా అందిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ పకారమే ప్రతిరోజు విద్యార్థులకు మధ్యాహ్న బోజనం అమలు చేయాలని, క్రమం తప్పకుండా విద్యార్థులకు చిక్కి కోడిగుడ్డు అందజేయాలని తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: నంద్యాలలో జరుగు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ ఎస్.సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందు మహిళా సమాఖ్య పతాకాన్ని డాక్టర్ సిహెచ్ గౌతమి ఆవిష్కరణ చేసారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గొని ప్రసంగిస్తూ నవంబర్ 17,18,19 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు నంద్యాలలో జరుగుతున్న సందర్భంగా ఆ మహాసభలలో మన జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా, సాధికారతే లక్ష్యంగా, విద్య, వైద్యం, ఉపాధితో పాటు కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ మహిళలలో పేద, దళిత, మైనార్టీ వర్గాలకు మెరుగైన జీవితం కోసం నిర్ణయాధికారంలో మహిళలకు భాగస్వామ్యం కోసం నిరంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పోరాటం కొనసాగిస్తుందని ఆమె తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తిగా విస్మరించారన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని ఏరులై పారిస్తూ తన సొంత వ్యాపారంగా మార్చుకొని కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. అందులో భాగంగానే మహిళల హక్కుల కోసం జరుగుతున్న అనేక అంశాలను చర్చించడానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలు జరగబోతున్నాయని తెలిపారు

పోరాటాలకు సిద్ధం కావాలి : మారుతి వరప్రసాద్

మహిళలంతా సంఘటితమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మహిళా వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని నంద్యాలలో జరిగే మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ కోరారు. మహిళా సమాఖ్య కార్యదర్శి కోలా స్వాతి, సిహెచ్ నిర్మల, ఎస్. సుబ్బాయమ్మ,నాగమణిలు ప్రసంగించారు. ఈ సభలో మహిళా సమాఖ్య జిల్లా నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ సిహెచ్ గౌతమి అధ్యక్షురాలుగా, ప్రధాన కార్యదర్శిగా ఏ.కే.నాగమణి, కోలా స్వాతి, కోశాధికారిగా జె.హెల్డా ఫ్లోరెన్స్, ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు సహాయ కార్యదర్శులు, 13 మంది కమిటీ సభ్యులుగా 35 మంది కౌన్సిల్ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇంకా ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్. హుస్సేన్, కాసా రాంబాబు, సిపిఐ కార్యవర్గ సభ్యులు బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, కృష్ణా నాయక్, హర్ష, చినజాన్ సైదా, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు ఎన్.సుబ్బాయమ్మ, నాయకులు బి.చైతన్య, ఏ.కాశి లక్ష్మి, సుజాత, ఎస్ దేవి, లలిత, దుర్గమ్మ, ఎక్కువ సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వైకాపా వై ఏపీ నీడ్స్ జగన్ అంటుంటే ఏపీ హేట్స్ జగన్ అనేది రాష్ట్ర ప్రజల కోరికగా ఉందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. ధరలు, పన్నులు, ఛార్జీలు, అప్పుల బాదుడుతో 52 నెలల పాలనలో ఒక్కో కుటుంబంపై రూ.8,25,549 అదనపు భారం మోపారని విమర్శించారు. రూ.57 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం వేశారని, బినామీలకు రూ.2.2 లక్షల కోట్ల విద్యుత్ కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపిం చారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో తాడేపల్లి ప్యాలెస్ రూ.15 వేల కోట్ల కమీషన్ కొట్టేసిందని విమర్శించారు. భూములు, ఇసుక, మద్యం, గనులు, డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం దోపిడీల రూపంలో జగన్ కుటుంబం రూ.3.5 లక్షల కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. ప్రత్యేక హెూదాను గాలికి వదిలేశారని, 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కాజేస్తున్నారని ఆరోపించారు.

దొంగ ఓట్లను చేరుస్తున్నారు : స్థానిక మంత్రి విడదల రజినిపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లోనే చిలకలూరిపేటలో 12 వేల దొంగఓట్లు చేర్చి ఆమె గెలిచారని, ఇప్పుడు మరోసారి అదే కుట్రలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. పురుషోత్తపట్నంలో దొంగ ఓట్లపై ఆధారాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దొంగ ఓట్లు చేర్చారో లేదో ప్రతి ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రికి సవాల్ చేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా దొంగఓట్లు తొలగించట్లేదని మండిపడ్డారు. చనిపోయిన వారి ఓట్లు కూడా తీయడం లేదన్నారు.

వైసీపీ పాలనలో పేదల బతుకులు దుర్భరం: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలన వల్ల పేదల బతుకులు మరింత దుర్భరంగా మారాయని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు. వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన మంత్రివర్గం, ఎమ్మెల్యేలు ధన దాహంపై దృష్టి పెట్టి అన్ని వర్గాల ప్రజలను విస్మరించారన్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో సమాజం కోసం ఒక్క మంచి పని కూడా చేయలేదని జీవీ విమర్శించారు. చంద్రబాబు హయాంలో మెరుగైన సమాజం కోసం యువత భవిష్యత్తు కోసం ఆరు లక్షల 50 వేల ఉద్యోగాలు కల్పించారన్నారు. నేడు యువత ఉద్యోగ ఉపాధి కల్పన లేక దారితప్పి గంజాయి. తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని దీనిపై రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా సాఫ్ట్వేర్ ఉద్యోగులు, యువత రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు జరిపి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఎండగట్టారని అన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అంటూ వారితో చేపలు, చికెన్, మటన్ దుకాణాలు పెట్టించి అవమానపరిచారన్నారు. ఈ నాలుగేళ్లు రాష్ట్రాన్ని ఏం అభివృద్ధి చేశాడని మళ్లీ జగనే కావాలని మంత్రులు ఎమ్మెల్యేలతో ప్రచారం చేయిస్తూ నియోజకవర్గాలకు తరుముతున్నాడని జీవీ ఘాటుగా విమర్శించారు. అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని బానిసలుగా మార్చి జగన్ నియంతగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. నవరత్నాలంటూ నవ మోసాలు చేస్తూ ప్రతి గ్రామంలో 20 వరకు అక్రమ మద్యం బెల్ట్ షాపులు పెట్టి చౌకబారు మద్యంతో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నారని జీవీ అన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు చేస్తానని చెప్పి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి మాట మార్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమై కార్మిక రంగం కుదేలైందన్నారు. ఇసుక దోపిడీ కారణంగా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడగా కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చంద్రబాబు హయాంలో కేవలం ట్రక్కు బాడుగలు తప్ప ఇసుక ఫ్రీగా ఇచ్చారన్నారు. ఇక ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో మద్య నిషేధం విధిస్తానంటు గొప్పలు చెప్పి. నేడు మరో 15 సంవత్సరాలు మద్యం అమ్మకాలు కొనసాగించే విధంగా కొన్నింటిని తాకట్టు పెట్టి రుణం తెచ్చిన సంగతి ప్రజలు గమనిస్తున్నారని. ప్రజల ఆస్తులకు హక్కులు కల్పిస్తామంటూ ఏవేవో డాక్యుమెంట్ ఇస్తూ. అసలు డాక్యుమెంట్లు ఇవ్వమంటున్నారని, వీటిని కూడా తాకట్టు పెట్టి లక్షల కోట్లు కాజేసేందుకా అని జీవీ ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పిన విధంగా వినకపోతే పెన్షన్లు, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని వార్డు వాలంటీర్లతో చెప్పిస్తున్నారని అన్నారు. పట్టణ సమీపంలోని జాలలపాలెం. వెంకుపాలెం సమీపంలో. 175 ఎకరాల ప్రభుత్వ భూమిని హస్తగతం చేసుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై ఒకరు కోర్టు కెక్కగా నాకేమీ కోర్టు నోటీసులు రాలేదు కదా అంటూ ఆయన చంకలు కొట్టుకుంటున్నాడని వాస్తవాలు త్వరలో బయటపెడతామని జీవీ అన్నారు. టిడిపి హయాంలో తాను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వినుకొండ పట్టణంలో నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో నాణ్యత ప్రమాణాలతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. రానున్న ఎన్నికలలో 40 వేల ఓట్ల తేడాతో బొల్లా బ్రహ్మనాయుడు ఓటమిపాలవుతారని జీవీ జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, షమీం. టిడిపి పట్టణ అధ్యక్షులు పి.అయూబ్ ఖాన్. పివి సురేష్ బాబు, హనుమాన్ నాయక్ పాల్గొన్నారు.

యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-నరసరావుపేట : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు నరసరావుపేట కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పలస్తీన ప్రజలకు మద్దతుగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను యుద్ధాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని స్థానిక ఏంజెల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాలని, శరణార్థులపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిలిపిదల చేయాలని డిమాండ్ చేశారు. మేధావులు వివిధ వర్గ ప్రజలందరూ ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని కోరారు. పలస్తీనా భూమిని 15శాతం నుంచి 85శాతం వరకు ఇజ్రాయిల్ ఆక్రమించిందని, దీనిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఒక మనిషి మరొక మనిషిని, ఒక దేశం మరొక దేశం ఆక్రమించే విధానాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటికైనా యుద్ధాన్ని నిలుపుదల చేయాలని ఐక్యరాజ్యసమితి కోరుతున్నా ఇజ్రాయిల్ తన సామ్రాజ్యవాదాన్ని అమాస్ ఉగ్రవాదులు పేరుతో పలస్తీనా ప్రజలపైన దాడి చేయటాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. శాంతి ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ రాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, దాసరి వరహాలు, షేక్. చిన్నజాను, సైదా, గుండాల హర్ష, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-రెంటచింతల : విశ్వ బ్రాహ్మణుల సమస్యలు ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అనంతవరపు గోపి ఆధ్వర్యంలో స్థానిక నేతలు రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొలగాని నంద వీరప్రసాదరావులను కలిసి విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర స్థాయిలో జాతి ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం జారీచేసిన జీవోలపై వారు చర్చించారు. మంగళ సూత్రం తయారీ హక్కుదారులుగా విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు వీలు కల్పిస్తూ చట్టం చేయాలని, కుల వృత్తులను ఆదరించేలా వడ్రంగులపై అటవీ శాఖ, స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 2009లోని జీవో నెంబర్ 272ను రద్దుపరచి స్వర్ణకారులకు అనుకూలంగా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖలో విశ్వబ్రాహ్మణ పురోహితులకు 50శాతం అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో శ్రీరాందాసు కృష్ణమూర్తి, ఒప్పిచర్ల సైదాచారి, శ్రీరాందాసు విశ్వరూపా చారి, వేములూరు వెంకటాచారి, గౌరోజు రామాచారి తదితరులున్నారు.

చారిత్రాత్మక నిర్ణయాలు జగన్ ప్రభుత్వంలోనే సాధ్యం

విశాలాంధ్ర-మాచర్ల : వెనుకబడిన పల్నాడులోని లక్షలాది ఎకరాలు సస్యశ్యామలానికి చేపట్టిన వరికపూడిశెల ప్రాజెక్టు శంకుస్థాపనకు ఈ నెల 15న మాచర్లకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి రానున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డిలతో సమీక్ష నిర్వహించి, సభా వేదికకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వరికపూడి శెల ప్రాజెక్టుకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో అన్ని అనుమతులు పూర్తిచేసి, ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ నెల 15న శంకు స్థాపన, పనులు ప్రారంభం చేయబోవటం చారిత్రాత్మకమన్నారు. ఈ ప్రాజెక్టుతో మాచర్ల, వినుకొండ, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాలు సాగులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, డీఎస్పీ పల్లపు రాజు, తహసిల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, కమిషనర్ రమణబాబు, సిఐలు శరత్‌బాబు, షేక్ సమీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అభ్యర్థనలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-మాచర్ల : స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డి.ఎం కార్యక్రమం నిర్వహించినట్లు డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య తెలిపారు. మాచర్ల నుంచి పిడుగురాళ్లకు రాత్రి 8 గంటల సమయంలో పల్లె వెలుగు బస్సును ఏర్పాటు చేయాలని కంభంపాడు, మంచికల్లు గ్రామాలకు చెందిన రాంబాబు, రాజశేఖర్ కోరగా పట్లవీడు బస్సు ముటుకూరులోని పెట్రోల్ పంపు వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, మాచర్ల నుంచి హైదరాబాదుకు ఉదయం, సాయంత్రం సమయాలలో కొత్తగా ఎక్స్ ప్రెస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని పట్లవీడు, కంభంపాడు, గన్నవరం గ్రామాలకు చెందిన మాణిక్యం, రంగారావు, సాగర్ బాబు కాల్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం సమస్యలను పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు ఆయన తెలిపారు.

పల్నాడు ప్రజల చిరకాల వాంఛ వరికపూడిశెల

విశాలాంధ్ర-దుర్గి: పల్నాడు ప్రజల సాగు, త్రాగునీరు ఏడు వసంతాల చిరకాల వాంఛ వరికపూడిశెల సాకారం కాబోతుందని పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాలునాయక్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, తహశీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి అన్నారు. దుర్గిలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం మాచర్లలో ఈనెల 15న జరగనున్న సీఎం జగన్ సభకు తీసుకోవలసిన ఏర్పాట్లు, జన సమీకరణ పై జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు స్వయంసహాయక సంఘాల సభ్యులు, రైతు సోదరులకు ప్రాజెక్టు యొక్క ప్రాదానిత గురించి అవగాహన కల్పించి ఈకార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే సీఎం శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం కావాలని చెప్పారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి సిబ్బంది, ప్రగతి మండల సమైఖ్య అధ్యక్షురాలు మేకల మాణిక్యం, విఓఏలు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడా పోటీలు

విశాలాంధ్ర-కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ లలితా శుక్రవారం తెలిపారు. కబ్బడి, ఖో ఖో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ క్రీడల నందు పోటీలు నిర్వహించామని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న రత్తయ్య తెలియజేశారు. విజేతలకు నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున బహుమతులు అందచేస్తామన్నారు.

సంక్షేమ పథకాల రూపశిల్పి జగనన్న

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు మండలంలోని ఈపురుపాలెం సచివాలయం - 2 పరిధిలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేశారు. వైకాపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కే నేతాజీ, వైకాపా నాయకులు మాట్లాడుతూ ఈపురుపాలెం సచివాలయం - 2 పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గవిని శ్రీనివాసరావు, అసాది అంకాల రెడ్డి, కాపూరి రమణారెడ్డి, బోయిన కేశవులు, బుర్ల సాంబశివరావు, బిట్రా శ్రీనివాసరావు, ఆకురాతి పద్మిని, రాజ్ కుమార్, దివి జయరాం, ఏపీఎం సుబ్బారావు, ఈఓపీఆర్ అండ్ ఆర్ డీ బందారు మురళీ బాపూజీ, వైకాపా నాయకులు, అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరిద్దాం..

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వైకాపా ప్రభుత్వ అసమర్థ విధానాలను వ్యతిరేకిస్తూ తెదేపాను ఆదరించాలని నియోజక వర్గ ఇంఛార్జి ఎం ఎం కొండయ్య అన్నారు. మండలంలోని బుర్లవారిపాలెం లో నారా చంద్రబాబు నాయుడు మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెదేపా అందించబోయే పథకాలను వివరిస్తూ రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకు తెదేపాను అధికారంలోకి తీసుకు రావాలని ప్రజలను కోరారు. స్థానిక తెదేపా కార్యాలయంలో నియోజక వర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావును బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్స్ ఎస్పీ సారూ...

విశాలాంధ్ర - బాపట్ల : అత్యంత కిరాతకంగా మా బిడ్డ ప్రాణాన్ని తీసిన నరరూప రాక్షసుడికి తగిన శాస్తి మీ వల్లే జరిగింది ఎస్పీ సారూ అంటూ కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి గొర్రెముచ్చు రమేష్ అతని భార్య లాజరమ్మలు ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల తన కుమారుడు రవికుమార్ హత్య కేసులో నిందుతుడు ఫ్రాంక్లిన్‌కు న్యాయంస్థానం జీవిత ఖైదు విదించటం పట్ల వారు స్పందించారు. కోర్టు తీర్పుతో తమ బిడ్డ ఆత్మకు శాంతి చేకూరిందన్నారు. అదేవిధంగా బాపట్ల డీఎస్పీ వెంకటేశులు, రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, కర్లపాలెం ఎస్సై శివయ్య తమకు న్యాయం జరగటంలో ఎంతో కృషి చేశారన్నారు. కన్న బిడ్డను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న తమకు న్యాయంస్థానం ఇచ్చిన తీర్పు ఊరటనిచ్చిందన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : నియోజకవర్గంలో పలుచోట్ల జరిగిన గ్యార్మీ పండుగ వేడుకల్లో టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. పట్టణంలోని 6వ వార్డు జమేదారు పేట,కర్లపాలెం మండలం పేరలి గ్రామం, కర్లపాలెం పంచాయితీ, కర్లపాలెం పాత ఊరులో ముస్లిం పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ పండుగ వేడుకలో వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలో రేపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మండలం లోని పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం విద్యుత్ సబ్ స్టేషన్స్ లలో మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అయన పేర్కొన్నారు. కావున వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

క్రీడా సామగ్రి అందజేత

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూత అందించడానికి ఊరా మస్తాన్ రావు ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని పేరాల ఆంధ్రరత్న మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్ రాజు అన్నారు.ఊరా మస్తాన్ రావు శివరాజ కుమారి ట్రస్ట్ ద్వారా క్రీడా దుస్తులు,సామగ్రి పేరాల ఏ ఆర్ఎం పాఠశాల విద్యార్థులకు అందించారు.ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు సుందర రామిరెడ్డి,పవని భానుచంద్ర మూర్తి,గాదం శెట్టి సుబ్రహ్మణ్యం డీవీడి ప్రసాద్,శివరాజకుమారి,రంగా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కాయపాలెం,పాపాయపాలెంలో గ్రామసభ

విశాలాంధ్ర - వేటపాలెం : అక్కాయపాలెం, పాపాయపాలెం పంచాయతీలలో శనివారం గ్రామసభ జరిగింది. ఈ సభలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కొరకు అర్జీలు స్వీకరించారు. కేంద్రప్రభుత్వం ద్వారా స్వచ్ఛతా హి సేవ లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఖరీఫ్ 2023 పంట నమోదుకు సంబంధించిన ఫిజికల్ రసీదులను రైతులకు అందించారు. వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కరపత్రాలు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ. కాశీవిశ్వనాథ్, పంచాయితీ కార్యదర్శి పూర్ణిమ , గ్రామ వ్యవసాయ సహాయకులు వినయ్ కుమార్, స్వాతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం ఎనిమిది దశాబ్ధాలుగా పోరాటం

- రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి
- 17 నుంచి నంద్యాలలో 15వ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర - చీరాల : మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 17,18,19 తేదీల్లో నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య రాష్ట్ర 15వ మహాసభలు జరగనున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం జాండ్రపేటలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా సర్వసభ్య సమావేశం జే రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కన్వీనర్, కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు వి జయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధే లక్ష్యంగా స్వేచ్ఛ, సమానత్వం కోసం మహిళా స్థితిగతుల్లో మార్పు కోసం, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్యా గత 8 దశాబ్దాలుగా పోరాటం చేస్తుందన్నారు. దేశ స్వాతంత్రం కోసం యుద్దోన్మాదాన్ని వ్యతిరేఖిస్తూ ప్రపంచ శాంతికి మతసామరస్యం కోసం ఉద్యమించిందన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం చేపట్టిన ఉద్యమాల్లో మహిళా సమైఖ్య సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు.సాంఘీక దురాచారాలను, మతఛాందస భావాలను అంటరానితనాన్ని వ్యతిరేఖిస్తూ మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలని మంచినీరు అందించాలని, ప్రసూతి కేంద్రాల కోసం మహిళ ఆరోగ్యం కోసం బాలికల విద్య బాల్య వివాహాల నిషేదం, వితంతూ పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ అవగాహన కల్పించిందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజా పోరాటాల ద్వారా ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. నూతన కమిటిలో జిల్లా కన్వీనర్‌గా జె రత్న కుమారి, కో కన్వీనర్లు గా పిక్కి దుర్గ,మేకల వెంకయమ్మను ఎన్నుకొన్నారు. మహిళ సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడాలని,కార్మికుల పక్షాన అండగా ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా నాయకులుమర్రి విజయ, సీపీఐ చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్, పొట్లూరి రామాంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలకు చిక్కిన పోలీసులు సస్పెండ్

విశాలాంధ్ర - బాపట్ల : ఏసీబీ దాడిలో పట్టుబడిన చుండూరు ఎస్సై ఇద్దరు కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎవరైనా అవినీతికి పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.గురువారం చుండూరు పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఏసీబీ దాడిలో బత్తుల గోవింద్ అను వ్యక్తి నుండి రూ.45 వేలు లంచం తీసుకుంటూ ఎస్ఐ బోరుగడ్డ భరత్ కుమార్, కానిస్టేబుళ్లు దారా క్రాంతి కుమార్, గరికపాటి రవీంద్రలు పట్టుబడ్డారు. ఏసీబీ దాడిలో పట్టుబడిన ముగ్గురిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. చుండూరు సర్కిల్ సిఐ ఇతరుల పాత్రపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. విచారణలో వారి పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ అవినీతి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీస్ శాఖలో ఎవరైనా అవినీతికి పాల్పడితే పోలీస్ శాఖ తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది వారికి అప్పగించిన బాధ్యతలను ఎటువంటి అవినీతికి తావు లేకుండా క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. పోలీస్ వారి సేవలను ప్రజలు హక్కుగా పొందాలని ఎవరైనా పోలీస్ సిబ్బంది అధికారులు లంచం అడిగితే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని అవినీతి నిరోధక శాఖ ప్రజల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన 14400 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు. ప్రజలందరూ పోలీస్ అందించే సేవలను స్వేచ్ఛగా, హక్కుగా పొందాలని జిల్లా ఎస్పీ కోరారు.

జనం గుండెల్లో నిలిచేలా జగనన్న సంక్షేమ పాలన

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజల గుండెల్లో నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పరిపాలన సాగిస్తున్నారని వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు.శుక్రవారం మండలంలోని నిజాంపట్నం -2 సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులుగా వారు హాజరై ప్రారంభించారు.తొలుత వైసీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సచివాలయం పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికి పంపిణీ చేయబడిన నగదు వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని చెప్పారు.రాష్ట్ర చరిత్రలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఏ ప్రభుత్వానికి సాధ్యంకాని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో అమలు చేసి సరికొత్త రికార్డు సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సరికొత్త పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. నాలుగున్నర సంవత్సరాలలో మేనిఫెస్టోలోని ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి ఎలాంటి సిపార్సులు, లంచాలకు తావు లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారులకే అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ కే దక్కుతుందన్నారు.రాష్ట్రానికి వైఎస్ జగన్ ఎందుకు కావాలంటే సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు, విద్య, వైద్యం, ఆరోగ్యం అందించేందుకేనని వారు తెలిపారు.సీఎం జగన్ ను మరల ముఖ్యమంత్రినీ చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బోటు యూనియన్ సర్పంచ్ మోపిదేవి శ్రీనివాసరావు, ఎంపిడిఓ ఎన్.నాగలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, కేవిఆర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అవినీతికి అరాచకాలకు అడ్డగా నియోజకవర్గం

విశాలాంధ్ర - వేమూరు : ప్రశాంత వాతావరణానికి నిలయంగా ఉండే వేమూరు నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించి అరాచకాలకు అడ్డగా మార్చారని టిడిపి పోలిట్ బ్యూరోసభ్యుడు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విమర్శించారు. శుక్రవారం వేమూరులో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని చుండూరు పోలీస్ స్టేషన్ పై ఏసీబీ అధికారులు దాడులు చేసి ఎస్సై ,ఇద్దరు కానిస్టేబుళ్లను పట్టుకున్నారని అంటే అవినీతికి ఏరకంగా అడ్డాగా మారిందో అర్థమవుతుందన్నారు. పోలీసు అధికారులు వైసీపీ ప్రభుత్వానికి అంట కాగుతూ నాయకులతోపాటు పోలీసులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పట్టుబడ్డ పోలీసులను కాపాడటం కోసం డీఎస్పీ, సిఐలు ప్రయత్నించారని విమర్శించారు. అదే కోవలో కొల్లూరు ఎస్సై రాజ్యలక్ష్మి కొట్టడంతో ఒక అనామకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడని గుర్తు చేశారు.ఇటువంటి అరాచకాలు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడలేదని ఈ ప్రభుత్వంలోని ఇటువంటి అరాచకాలు పేట్రేగి పోతున్నాయన్నారు. గంజాయి గ్రామల వరకు విస్తరింప చేశారని, కేవలం అక్రమార్జన కోసమే ఇటువంటి అరాచకాలు పాల్పడుతూ వైసిపి ప్రభుత్వం పెద్దలు నాయకులు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు .ప్రజలు వీటన్నిటిని అర్థం చేసుకున్నారని రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. పోలీసులు కూడా తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయబాబు, దాది లక్ష్మణరావు, షేక్ అనీఫ్ తదితరులు ఉన్నారు.

రాష్టానికి జగన్ అవసరం ప్రజలకు తెలియజేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : వై నీడ్స్ ఏపీ జగన్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని 20, 21 వ వార్డులకు సంబంధించిన సచివాలయాలలో నిర్వహించినట్లు పట్టణ వైసీపీ అధ్యక్షులు గడ్డం రాధ కృష్ణమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వం చెయ్యలేని అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. 20, 21 వ వార్డులకు సంభందించి సుమారు 17 కోట్ల రూపాయలకు పైగా వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఖర్చు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు పట్టణ పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలలో ఆంధ్రకు జగన్మోహన్ రెడ్డి యొక్క ఆవశ్యకత ఎందుకు అవసరం అనే విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి భవిష్యత్తులో ముఖ్యమంత్రి యొక్క అవసరాన్ని తెలియజేయాలని ఆదేశించారు. పట్టణ, మండల స్థాయిలో ఉన్న నాయకులతో పాటు గ్రామస్థాయి నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బడుగు బలహీన వర్గాలకు అండగా జగన్

విశాలాంధ్ర - చీరాల : బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా ఉండాలంటే మళ్లీ ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డి రావాలని చీరాల పట్టణ అధ్యక్షుడు-1 కొంద్రు బాబ్జి అన్నారు. చీరాల మరియమ్మ పేట సచివాలయ పరిధిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమన్ని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,చీరాల పట్టణ అధ్యక్షుడు -1కొంద్రు బాబ్జి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంద్రు బాబ్జి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన ఇన్ని సంవత్సరాలలో సంక్షేమ పథకాలు ఇంటింటికి తీసుకువెళ్లిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు అన్న చంద్రబాబుకు,దళితులే నా మేనామామలు అన్న జగన్మోహన్ రెడ్డికి మధ్య వ్యత్యాసం ప్రజలు గమనించాలని అన్నారు. గతంలో 14 ఏళ్ళు ముఖ్యమంత్రి గా చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏ సంక్షేమం అందించారో,ఒక సారి అవకాశం వచ్చాక జగన్మోహన్ రెడ్డి ఇంటింటికి సంక్షేమ పథకాలు ఎలా అందించారో గమనించి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసియస్ పట్టణ కన్వీనర్ కోలా శివ,జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనీల్,చిలుకోటి శ్రీనివాస రావు,బొల్లాపల్లి నీల్,వాసిమళ్ళ రత్నం,బట్టు పోతురాజు,బొల్లాపల్లి వెంకట్రావ్,రత్న బాబు,దీపక్, కృపారావ్,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు మరియు గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కూచినపూడి పీ.హెచ్.సీ సూపర్వైజర్ మురళి సూచించారు.శుక్రవారం మండలంలోని అడవులదీవి పంచాయతీ పరిధిలోని రామకృష్ణపురం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు.వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.అలాగే ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించారు.ఇటీవల కురిసిన వర్షాలకు తొట్టెల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని వైద్య సిబ్బందితో తొలగింపు చేశారు.ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఆరోగ్యం కాపాడుకోడానికి కాచి వడపోసిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు.దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పీహెచ్సీలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, జ్వరాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజలకు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్నామని మురళి తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కళ్యాణ్ రాజా, ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశా వర్కర్ రాజకుమారి పాల్గొన్నారు.

సబ్సిడీపై రుణ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ కాపూరి రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన శాఖకు సంబంధించి పూల తోటలకు, హైబ్రిడ్ కూరగాయలకు సబ్సిడీపై రుణములు ఇస్తున్నట్లు, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. పాడి పరిశ్రమలకు సంబంధించి కేంద్రము 50 శాతం సబ్సిడీపై గొర్రెలు, పందులు, కోళ్ల పరిశ్రమకు ఋణసౌకర్యాలను రైతులకు కల్పిస్తున్నది అన్నారు. తోటవారిపాలెం పంపింగ్ స్కీం క్రింద ఆరుతడి పంటలకు నీళ్లు ఇవ్వవలసిందిగా బోర్డ్ సభ్యులు నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు అందిస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ఎఫ్రాయిము మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపి, ఆరుతడి పంటలకు గాను మినుము వేయాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో మండలఏవో ఐ సుమతి, హెచ్ ఓ అలేఖ్య, పశు వైద్యులు పావని, నీటిపారుదల ఏఈ పవన్, డ్రైనేజీ ఏఈ డేనియల్, సలహా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య క్రిస్టియన్ జేఏసీ నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర - చీరాల : సామాజిక హక్కులు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు. తోటవారిపాలెం పెనుయేలు ప్రార్ధన మందిరంలో పాస్టర్ రెవరెండ్ గుమ్మడి రత్న ప్రకాష్ ఆధ్వర్యంలో ఏపీ ఐక్య క్రిస్టియన్ జె ఏ సి నూతన కమిటీ ని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు మోపర్తి జాన్,తహాసిల్దార్ జీవిగుంట ప్రభాకరరావు,గుమ్మడి రత్న ప్రకాష్ లు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులపై అవగాహన కలిగి వుండలన్నారు.కులాల పేరిట మతాల పేరిట విభజించే వారికి దూరంగా ఉండాలని మనమంతా భారతీయులమని అన్నారు.వ్యక్తుల స్వలాభం కోసం విభజిస్తారని భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం భారత దేశమని ఎవరి స్వేచ్ఛకు భంగం కలగకుండా జీవించాలని అన్నారు. చర్చిలపై,మతం పేరిట దాడులు చేసే సంస్కృతులు మారాలని ఐకమత్యంగా కలసి జీవిద్దామని అన్నారు.ఐక్య క్రిస్టియన్ జేఏసి క్రైస్తవుల మధ్య ఐక్యమత్యం పెంచేందుకు కృషి చేస్తుందన్నారు.తదనంతరం బాపట్ల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా మోపర్తి జాన్,సంఘ సేవకులు దాసరి లుదర్ శాస్త్రి,బాపట్ల జిల్లా అధ్యక్షులు గా గుమ్మడి రత్నప్రకాష్, కార్యదర్శులుగా పొందుగల స్టాలిన్, నూనె ఏసోబు,సభ్యులుగా బడుగు డేవిడ్,యోనిచర ఆరోగ్యం,పులిపాటి రవి,రామేశ్వరం కుమార్,జాల రాజేష్,సంక్రాంతి ముసలయ్య,శీలం వెంకటేశ్వర్లు,కొంద్రు ఆశీర్వాదం, బడుగు అంథోని,బాపట్ల కార్యదర్శిగా గుమ్మడి ఆనంద్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లాలోని పలువురు దైవసేవకులు యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు..

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి: మంత్రి

విశాలాంధ్ర-పర్చూరు: అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక రాజ్యలక్ష్మీ గార్డెన్స్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న పనులపై దృష్టి సారించి పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్, డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, డీఎస్ఓ విలియమ్స్, హౌసింగ్ పీడీ ప్రసాద్, జేడీఏ అబ్దుల్ సత్తార్, ఎండోమెంట్ డీసీ పానకాలరావు, పౌరసరఫరాల శాఖ డీఎం లక్ష్మి, మార్కెఫెడ్ డీఎం కరుశ్రీ, ఫారెస్ట్ అధికారి భూమయ్య, పశువర్ధనశాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, సీపీఓ భరత్, జడ్పీసీఈఓ జాలిరెడ్డి, నియోజకవర్గంలోని అధికారులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-అద్దంకి ; మండలంలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. శుక్రవారం స్థానిక కామేపల్లి కళ్యాణ మండపం నందు జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో భూములకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయన్నారు. భూసమస్యలను పరిష్కరించాలని అధికారు లకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో బాధితుల సమస్యలు పరిష్కరించాలని గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌ను ఆదేశించారు. మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. గృహ నిర్మాణాల పనుల పురోగతి చూపని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్,చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి సరోజిని,గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, రవాణాశాఖ అధికారి ఏ.చంద్రశేఖరరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి రాజ్ దిబోరా,డిఎస్‌వో విలియమ్స్, డిఎం, శ్రీలక్ష్మీ, వ్యవసాయ శాఖ జెడి,అబ్దుల్ సత్తార్,పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, తహాశీల్దార్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూ సర్వే ఉచిత సరిహద్దు రాళ్ళు

విశాలాంధ్ర - రేపల్లె : జగనన్న భూ రక్ష - భూ హక్కు పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేలకు రైతులు అందిస్తున్న సహకారం అభినందనీయం అని తహాశీల్దార్ మల్లికార్జున రావు అన్నారు. మండలంలోని రైతులకు ఉచితంగా అందించేందుకు తీసుకువచ్చిన హద్దు రాళ్ళను పరిశీలించి భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే 125 సంవత్సరాల తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవతో, సాహసోపేతంగా భూముల రీ సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. భూ సర్వేలో భాగంగా రైతులకు సంబంధించిన భూముల వివరాలను కొలిచి బార్కోడ్‌తో రూపొందించిన సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు. గతంలో 1906లో బ్రిటీష్ వారు రూపొందించిన ఆర్ఎస్ ఆర్ రికార్డు ప్రకారం సర్వే జరిగిందన్నారు. 2021లో ఇప్పుడు జరుగుతున్న భూ సర్వే క్యూఆర్జిఎస్ సాఫ్ట్‌వేర్‌తో ఆధునిక పద్ధతుల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కారుమురు, అరవపల్లి గ్రామాలలో జరుగుతున్న డ్రాఫ్టు ల్యాండరీలు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు. రైతులకు గ్రామ సభల్లో చెప్పిన విధంగా రైతుల పొలాలకు, గ్రామ పొలిమేరలు, సరిహద్దులకు, ప్రభుత్వ భూములకు, గ్రామాల్లోని కూడలి ప్రాంతాలలో సరిహద్దు రాళ్లను ఉంచితంగా వేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - మార్టూరు : పాలస్తీనాపై ఇజ్రాయేల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ మార్టూరులో జరిగింది. ఇజ్రాయిల్ సాగిస్తున్న నర మేధాని ఆపాలని ప్రపంచ శాంతి వర్థిల్లాలని పాలస్తీనా ప్రజల జాతీయ విముక్తి పోరాటాలు వర్థిల్లాలని నినదిస్తూ నిర్వహించారు. ఈకార్యక్రమానికి బి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘ నాయకులు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలు 75 సంవత్సరాలుగా తమ భూభాగం కోసం సామ్రాజ్య వాద ప్రేరణతో ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఎదుర్కొంటూ పాలస్తీనా ప్రజలు నిలబడుతున్నారన్నారు. అంతర్జాతీయ ఒప్పందాలను న్యాయ సూత్రాలను ఉల్లంఘించి ఆసుపత్రులపై, నివాస ప్రాంతాలపై విచక్షణా రహితంగా బాంబుల వర్షం కురిపిస్తూ పసిపిల్లలను మహిళలను వేలాదిమంది ప్రజలను నేటి ఇజ్రాయిల్ అమెరికా అండదండలతో హత్య చేస్తుందన్నారు. యుఎన్ఓ, ఐక్యరాజ్యసమితి వెంటనే కలుగజేసుకొని మారణహోమం ఆపాలని అంతర్జాతీయ సమాజం పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలబడాలని కోరారు. ప్రపంచ శాంతి కోసం అందరూ పాటుపడాలని అన్నారు. కందిమల్ల రామ్ కోటేశ్వరరావు మహమ్మద్ భాష ముస్లిం కమ్యూనిటీ నాయకులు సనావుల్లా, మౌలాలి, ఖాదర్ మస్తాన్, కార్మిక నాయకులు మేకా ఇర్మియా, రైతు నాయకులు సూరిబాబు, ప్రజాస్వామ్యవాదులు బి.బెంజిమెన్, తస్లీమా నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ ప్రారంభించిన తాండ్ర

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణం సూర్యలంక రోడ్డులో మాజీ సైనికుడు మొహిద్దీన్ ఏర్పాటు చేసిన మెహెఫ్ఫాజ్ మామ్స్ కుకింగ్ రెస్టారంట్ ప్రారంభోత్సవంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు స్వయం ఉపాధి కోసం వ్యాపార రంగాలలోకి కూడా రావటం చాలా సతోషాకరమన్నారు. మాజీ సైనికులు నీతి, నిజాయితీ, దేశ భక్తి కలిగి ఉంటారన్నారు. మాజీ సైనికుడు మొహిద్దీన్ మొదలు పెట్టిన రెస్టారంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున బాపట్లలోని మాజీ సైనికులు పాల్గొనటం మాజీ సైనికుల ఐక్యతకు నిదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేష రెడ్డి, సెక్రటరీ సయ్యద్ అఖిల్, కోశాధికారి పువ్వాడ యల్లమంద, సలహాదారులు అల్లావుద్దీన్, సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, కొండల రావు సహా బాపట్లలోని మాజీ సైనికులు పాల్గొన్నారు.